# రైతుల రవాణా సమస్యలను పరిష్కరించాలి

**గంభీరావుపేట:** గంభీరావుపేటలో రైతులకు రవాణా విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని శ్రీ సాయిరామ అసోసియేషన్ సభ్యులు కోరారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని లారీ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపి, రైతులకు అనుకూలంగా ట్రాక్టర్లు నడపడానికి అనుమతి ఇవ్వాలని స్థానిక తహశీల్దార్ మారుతి రెడ్డి, లారీ అసోసియేషన్ అధ్యక్షులను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మారుతి రెడ్డి, లారీ అసోసియేషన్ అధ్యక్షులు ట్రాక్టర్లు నడపడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో రైతులకు రవాణా పరంగా ఊరట కలిగింది. రైతుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించినందుకు అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిరామ అసోసియేషన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మరవిని మహేష్, గౌరవ అధ్యక్షులు పెద్దవిని రాజమల్లయ్య, ఇరవైని సత్యం, గంట రమేష్, ఎగదండి మహేష్, టేక్ మల్లరాజు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు అండగా ఉంటాం

- అర్హులందరికీ త్వరలో ఉపకరణాలు అందిస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**సిరిసిల్ల:** దివ్యాంగులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు. అర్హులందరికీ త్వరలోనే సహాయ ఉపకరణాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సీఎస్ఆర్ కింద రూ.83లక్షల విలువైన 813 సహాయ ఉపకరణాలను దివ్యాంగులకు అందజేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళా మందిరంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్లు తదితర ఉపకరణాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.1600 కోట్లు కేటాయించిందని తెలిపారు. అర్హులందరికీ దశల వారీగా సహాయ పరికరాలు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో సమాజంలో రాణిస్తున్నారని ప్రశంసించారు. వారికి సమాజం పూర్తి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలని, డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది కూడా సైకిళ్లు పంపిణీ చేస్తామని, దాదాపు 15వేల సైకిళ్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ దివ్యాంగులు సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సుగమ్య భారత్ లక్ష్యంగా దేశ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షల ద్వారా అర్హులను గుర్తించామని తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పెట్రోల్ బంక్ ద్వారా 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూడీఐడి కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెలవారీ వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూపారాణి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, సీఎస్ఆర్ హెడ్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈఓ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల పెళ్లిళ్లకు ప్రభుత్వం భరోసా




**ఆదిలాబాద్:** పేద ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను అమలు చేస్తోందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా లబ్ధి చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ అర్బన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కలిసి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధి కోసం దళారులకు, ఇతరులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్, కౌన్సిలర్లు జీవన్, రాకేష్, విజయ్, మెహబూబ్, మునవ్వర్ సుల్తానా, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కేసుల విచారణ వేగవంతం చేయాలి

- గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**గుడిహత్నూర్:** కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణతో పాటు లోపలి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల పురోగతిపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, కేసుల విచారణలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఎస్పీ వెంట స్థానిక ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# పంట అవశేషాలను కాల్చవద్దు

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్:** వ్యవసాయంలో పంట కోతల అనంతరం మిగిలే పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించి భూసారాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా రైతులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి ఆరోగ్యాన్ని సంరక్షించడం ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. పంట అవశేషాలను కాల్చడం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని, భూమి సారవంతం తగ్గిపోతుందని తెలిపారు. మంటలు అదుపుతప్పి సమీప పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాగే చెత్తను కాల్చడంతో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యం పెరుగుతుందని వివరించారు. దీని ప్రభావంతో వృద్ధులు, చిన్నారులు, పశువులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రీయ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి కీలక పోషకాలు నశిస్తాయని తెలిపారు. మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోవడంతో నేల నిస్సారమై పంట దిగుబడులు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. భూసారం తగ్గిపోవడంతో రైతులు రసాయన ఎరువులపై అధికంగా ఆధారపడాల్సి వస్తుందని, ఫలితంగా సాగు ఖర్చులు పెరుగుతాయని తెలిపారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రోటవేటర్ సహాయంతో అవశేషాలను భూమిలో కలియదున్నడం ద్వారా అవి సేంద్రీయ ఎరువుగా మారుతాయని తెలిపారు. అలాగే కంపోస్ట్, వర్మీ కంపోస్ట్ తయారు చేసి పొలాల్లో వినియోగించాలని సూచించారు. వరి గడ్డిని పశుగ్రాసంగా ఉపయోగించవచ్చని చెప్పారు. మల్చింగ్ పద్ధతిలో పంట అవశేషాలను వినియోగించడం ద్వారా భూమిలో తేమ నిల్వ ఉండి నీటి వినియోగం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. "పర్యావరణాన్ని కాపాడండి–రైతు భవిష్యత్తును రక్షించండి" అనే లక్ష్యంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు, లాభాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఓంకార్ శతజయంతి ముగింపు సభను జయప్రదం చేయండి

**హన్మకొండ:** ప్రజా సంక్షేమం పేరుతో వినాశనకర విధానాలను అమలు చేస్తూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తున్న పాలకులకు కమ్యూనిస్టు, వామపక్ష, సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి అన్నారు. ఈనెల 12న నర్సంపేటలో జరిగే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. జిల్లాలో పత్తి పంట దెబ్బతిని రైతులు అప్పుల పాలయ్యారని, లక్ష ఎకరాల్లో మొక్కజొన్న పంట పండించినా కనీస మద్దతు ధర లభించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం సరిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక ప్రైవేట్ వ్యాపారులకు, దళారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తక్షణమే రైతు వేదికల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని, ప్రశ్నించే స్వేచ్ఛపై అణచివేత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ విలువలు, త్యాగాలు, ఆదర్శాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు, వామపక్ష శక్తులు ఐక్యం కావాలని ఓంకార్ ఎప్పుడూ ఆకాంక్షించారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం తమ పార్టీ కృషి చేస్తోందని చెప్పారు. ఈ సభను ఈనెల 12న నర్సంపేట సిటిజన్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు జాతీయ, రాష్ట్ర స్థాయి కమ్యూనిస్టు, వామపక్ష నాయకులు హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



# ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయండి

**హన్మకొండ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో ఈనెల 10న పరేడ్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ నాయకులు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులతో గురువారం సమావేశం నిర్వహించారు. మాజీ జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కాంటెస్టెడ్ రావు పద్మ రెడ్డి సమావేశానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, 47వ డివిజన్ అధ్యక్షులు గంధసిరి శ్రీకాంత్, 63వ డివిజన్ అధ్యక్షులు రణికుంట్ల కళ్యాణ్ కుమార్, 62వ డివిజన్ అధ్యక్షులు మేకల శ్రవణ్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు కాయిత రాజ్ కుమార్ యాదవ్, భగవాన్ దాస్ ఉపాధ్యాయ, శనిగరపు చందర్, గొర్రె శ్రీనివాస్, విష్ణు, కుమార్, భరత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



